నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: దివంగత మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను తెలంగాణ వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెట్టెబావి ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పాపిరెడ్డినగర్ రోడ్ నం .11లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి: డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఉదయం 11గంటలకు బాలానగర్‌లో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డా. ఎస్‌వీ ప్రసాద్

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో శ్వాసకోశ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, బీపీ, చర్మ, దంత, కాళ్ల, నేత్రాలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్‌ఎస్ మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) కార్యాలయంలో భవిష్య నిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.వామంత్ తెలిపారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లో రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని అన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. గోల్కొండ బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన



మోతీనగర్: మోతీనగర్‌లోని శృంగేరి శారదా శంకరమఠంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కోటి కుంకుమార్చనలో పాల్గొని పూజలు చేశారు. ఈనెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త సీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

ఈఎన్‌టీ వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయంలో ఆదివారం క్లావో ఈఎన్‌టీ అండ్ వాస్కులర్ హాస్పిటల్ వైద్యులు సౌజన్య, మహేష్ ఆధ్వర్యంలో ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో కూడా ఉచిత ఈఎన్‌టీ శిబిరం ఏర్పాటు చేయాలని వారిని కోరిన వెంటనే ఒప్పుకోవడం హర్షణీయమని అన్నారు. అదే విధంగా పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిట్ల మనోహర్, మల్లేష్‌గౌడ్, డాకయ్య, టి.శైలేష్, మనోహర్, ఎర్రస్వామి, ఎం.ఐలయ్య, రవిగౌడ్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. నల్లగండ్ల హుడా కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసులు ఎమ్మెల్యే నివాసంలో గాంధీని కలిశారు. అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, 100 ఫీట్ల రోడ్డులో స్ట్రీట్ లైట్‌లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరగా గాంధీ మాట్లాడుతూ త్వరలో నల్లగండ్ల హుడా కాలనీలో పర్యటిస్తానని చెప్పారు. అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీకాంత్, కిషోర్, రాజేశ్వర్‌రావు, శ్రీరామ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

హరే రామ.. హరే కృష్ణ

నయనానందకరంగా జగన్నాథుడి రథయాత్ర









ఆల్విన్‌కాలనీ: 'హరే రామ.. హరే కృష్ణ', జై జగన్నాథ్ అనే నామస్మరణతో ముంబాయి జాతీయ రహదారి మార్మోగింది. ప్రజాప్రతినిధులు, సంఘాల నేతలు, భక్తులు రథం ముందు బంగారు చీపురుతో ఊడ్చి రథయాత్రను ప్రారంభించారు. భక్తులు కోలాటం, నృత్యం చేస్తూ.. జగన్నాథుడి రథాన్ని లాగుతూ తన్మయత్వం చెందారు. దారిపొడువునా రంగురంగుల ముగ్గులు వేసి వస్తున్న జగన్నాథ రథయాత్రకు మంగళ హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. రాధాకృష్ణుల వేషధారణలో పిల్లల సందడి చేశారు. డప్పువాయిద్యాల నడుమ సాగిలో రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ పూరి జగన్నాథ రథయాత్రను తలపించేలా ఆదివారం నియోజకవర్గంలో జగన్నాథ రథయాత్ర నయనానందకరంగా సాగింది. అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ డైరెక్టర్ మహా శృంగదాస్ ఆధ్వర్యంలో ఊరేగింపు కొనసాగింది. హైదర్‌నగర్‌లోని విజయలక్ష్మి దేవాలయం ప్రాంగణం నుంచి జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ కాలనీ,భాగ్యనగర్‌కాలనీ,కూకట్‌పల్లి మెట్రో వరకు రథంపై జగన్నాథ, బలభద్ర, సుభద్రలను భక్తులు ఊరేగించారు. బొంబాయి జాతీయ రహదారిపై అడుగడుగునా భక్తుల కోలాహలం కనబడింది. అనంతరం కూకట్‌పల్లి మెట్రో వద్ద ఉన్న ఫంక్షన్‌హాల్‌లో భక్తులకు స్వామివారి మహా ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.



గంగారం వద్ద మూసివేసిన సిగ్నల్



యూ టర్న్ వద్ద ట్రాఫిక్ జామ్

యూటర్న్ ప్రాబ్లమ్

హఫీజ్‌పేట్: చందానగర్ జాతీయ రహదారిపై యూటర్న్‌లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ రహదారిలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సిగ్నళ్ళను మూసి వేసి యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. దీని వల్ల కొంత మేర ఉపశమనం కలిగినప్పటికి యూ టర్న్‌ల వద్ద తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారులపై మలుపులు ఉండరాదనే నియమాలు ఉన్నప్పటికీ.. చందానగర్, గంగారం ఏరియాలు నగరానికి చేరువుగా ఉండడంతో ఇక్కడ యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఇవి ట్రాఫిక్ జామ్‌లకు నిలయంగా మారాయి. నిత్యం ఐటీ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం సమయాలలో భారీగా రాకపోకలు చేస్తుంటారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. కాగా పలు రహదారులపై పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌తో సాఫీగా రోడ్డు దాటుతున్నారు. కానీ సిగ్నళ్లు మూసివేసినప్పటి నుంచి పాదచారులు రోడ్డు దాటాలంటే అష్టకష్టాలు పడుతున్నారు.

జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు.. ట్రాఫిక్ కష్టాలు

- ◆ చందానగర్, గంగారం ప్రాంతాలలో ఉన్న యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్ జాంలు తీవ్రంగా ఉంటున్నాయి.
- ◆ జాతీయ రహదారి కావడంతో ప్రధానంగా సాయంత్రం పూట ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం.
- ◆ పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌తో కూడిన సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి.
- ◆ ట్రాఫిక్ సమస్య ఉన్న యూ టర్న్‌లను మూసివేయాలి.
- ◆ ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యామ్నాయ రోడ్లు గుర్తించి వాహనాలు మళ్లించాలి
- ◆ నిత్యం యూ టర్న్‌ల వద్ద ప్రత్యేకంగా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.





చందానగర్ జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద వాహనాల రద్దీ

యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు



చందానగర్ నుంచి గంగారం వరకు మూడు యూటర్న్‌లు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ తీవ్రంగా ఉంది. రద్దీ సమయంలో పాదచారులకు ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ జామ్‌లు నెలకొనకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– శేఖర్, చందానగర్

అవసరమైన చోట సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



చందానగర్ జాతీయ రహదారిపై అవసరం ఉన్న చోట సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. యూ టర్న్‌ల వల్ల కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గినా ప్రమాదాలకు దారితీస్తుంది. –అశోక్, చందానగర్

బిల్డర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సుబ్బయ్య మృతి



(ఫైల్)

కూకట్‌పల్లి: వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్(డబ్ల్యూజెడ్ మాజీ అధ్యక్షుడు ముప్పా సుబ్బయ్య శనివారం రాత్రి మియాపూర్‌లోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్ సంక్షేమ సంఘం సభ్యుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పనిచేశారు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు సంతాపం తెలిపారు.

అలరించిన ఆరుషి నృత్య ప్రదర్శన

మాదాపూర్: ఆరుషి నాగభైరవ కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం ప్రముఖ నాట్య గురువులు నీలిమ సమక్షంలో ఆరుషి కూచిపూడి అరంగ్రేటం చేసింది. భామాకలాపం, తరంగం, అన్నమాచార్య కీర్తనలు, తిల్లాన, గోవిందనామాలను నృత్యరూపంలో ప్రదర్శించి అలరించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కూకట్‌పల్లి: హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బండరు దత్తాత్రేయను ఆదివారం కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయనతో ముచ్చటించి యోగక్షేమాలను తెలుసుకున్నారు.

ఇంట్రామూట్ కోర్టులో న్యాయ విద్యార్థుల సందడి



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రొ.డాక్టర్ జీబీ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. చంద్రమతి

కేపీహెచ్‌బీకాలనీ: న్యాయం కోసం పోరాడే యువ న్యాయవాదుల సందడితో అనంత న్యాయ కళాశాల మూడో ఇంట్రామూట్ కోర్టు మార్మోగింది. కోవిడ్ టీకాకు సంబంధించిన అప్పీలు కేసు అంశంపై పోటీలు జరిగాయి. ఇందులో 24 బృందాలుగా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఓయూ సీనియర్ ప్రొ. డాక్టర్ జీబీ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రమతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా. జీబీరెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు న్యాయ విద్యార్థులకు మంచి అవకాశమన్నారు. అంతేకాకుండా నూతన చట్టాలు బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏల ఆవిర్భావం, ఆవశ్యకతలపై లోతైన అవగాహన కల్పించారు. నూతన చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించటం ఎంతో అవసరమని చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన బృందాలను సన్మానించి అవార్డులు అందజేశారు.

'సర్వామృత ప్రాశన' కార్యక్రమం షురూ

కూకట్‌పల్లి: ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజు 16 సంవత్సరాలలోపు పిల్లలకు వేసే రోగ నిరోధక శక్తి, మెదడును ఉత్తేజ పరిచే సర్వామృత ప్రాశన కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ సర్వామృత ప్రాశన కార్యక్రమాన్ని కేపీహెచ్‌బీ కాలనీలోని ఎంఐజీ 578లో జరిగింది. ఈ కార్యకరమంలో సుమారు 54 మంది పిల్లకలు యోగేష్ ప్రభు స్వర్ణామృతాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగనుందని తెలిపారు.



చిన్నారులకు స్వర్ణామృత పాశాన్ని అందజేస్తున్న యోగేష్‌ప్రభు

తాగునీరు రోడ్డుపాలు

మోతీనగర్: వాటర్ పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు మోతీనగర్ చౌరస్తా నుంచి ఈ సేవ వరకు వృథాగా పోతోంది. వర్షాకాలంలోనూ కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందటం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో విలువైన తాగునీరు లీకేజీల కారణంగా రోడ్డుపాలవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.





మోతీనగర్ ప్రధాన రోడ్డులో లీకేజీలతో రోడ్డుపై పారుతున్న తాగునీరు

అయ్యప్ప జేఏసీ ఆత్మీయ సమావేశం

హఫీజ్‌పేట్: చందానగర్ గంగారంలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో రాష్ట్ర అయ్యప్ప జేఏసీ ఆత్మీయ సమావేశం ప్రసాద్‌రావు గురుస్వామి సౌజన్యంతో అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా అరుణ్ గురుస్వామి, ప్రసాద్‌రావు గురుస్వామి, 11 జిల్లాల నుంచి సుమారు 250 మంది గురుస్వాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణ్ గురుస్వామి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఇరుముడులతో వెళ్తున్న భక్తులకు కేరళ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రవి, సత్యనారాయణ, రామచంద్రరావు, శ్రీనివాస్, జ్యోతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐబీడీ పురోగతిపై అంతర్జాతీయ సదస్సు

మాదాపూర్: భారతదేశంలో దక్షిణాన ఇన్‌ఫ్లమేటరీ పేగు వ్యాధి వేగంగా పెరుగుతోందని యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్‌లో ఆదివారం ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ (ఐబీడీ) పురోగతులపై అంతర్జాతీయ సదస్సు, లైవ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో ప్రపంచం నలుమూలల నుంచి 300 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో దశాబ్దకాలంగా ఐబీడీ కేసులు గణనీయంగా పెరిగాయన్నారు. రెగ్యులర్ లైఫ్‌స్టైల్‌తో పాటు ఒత్తిడిని తగ్గించుకోవడం వల్ల సమస్యను అధిగమించ వచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కిరణ్‌పెద్ది, డాక్టర్ చార్లి, డాక్టర్ దీపక్ పాల్గొన్నారు.

చిత్తారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి: ఆషాఢ మాస మొదటి ఆదివారాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి చిత్తారమ్మ ఆలయంలో బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో ఆకుల లక్ష్మణరావు, భోజరాజు రవి, పత్తి వారి కరణ, బసవన్నగారి నరసింహారెడ్డి, అంబటి సంతోష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి చిత్తారమ్మ ఆలయంలో జరిగిన పూజలో తెల్ల హరికృష్ణ కుటుంబ సభ్యులు

'సీతంబాయి పొలం' కథల సంపుటి ఆవిష్కరణ

రాయదుర్గం: తెలంగాణకు చెందిన ప్రముఖ కథా రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఏఎం అయోధ్యరెడ్డి తాజా కథల సంపుటి 'సీతంబాయి పొలం' పుస్తకావిష్కరణ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని జర్నలిస్టుకాలనీలో సొసైటీ కార్యాలయం హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఏఎస్ జగన్నాథశర్మ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశానికి హాజరైన అయోధ్యరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత స్పీడ్ యుగంలో కథలు చదివే పాఠకులు కరువయ్యారని, మరీ ముఖ్యంగా ఈ తరం యువత, పిల్లలు తెలుగు సాహిత్యానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . కార్యక్రమంలో పలువురు సీనియర్ కవులు, రచయితలు, కార్టూనిస్టులు, జర్నలిస్టులు వేణుగోపాలస్వామి, ప్రతాప్‌రెడ్డి, గురువారెడ్డి పాల్గొన్నారు.

